## క్లుప్తంగా

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

**చీరాల టౌన్:** గ్రామ పంచాయతీల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కార్యదర్శులు విధులు సమర్థంగా నిర్వహించి గ్రామాలను అభివృద్ధిలో ఉంచాలని ఎంపీడీవో బి.శివన్నారాయణ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సెక్రటరీలు, సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి పెండింగ్ అర్జీలు విచారించినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిశితంగా విచారించి అర్హులైన ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం అందించాలన్నారు. ప్రభుత్వ సేవలను సత్వరంగా అందించేందుకు సచివాలయాల సిబ్బంది అంకిత భావంతో పని చేయాలని సూచించారు. సచివాలయం ద్వారా అందించే సేవలను నిర్ణీత సమయంలోగా అర్జీదారులకు అందించాలన్నారు. గ్రామ పంచాయితీలు కేటాయించిన నిధులు సక్రమంగా వినియోగించి అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యదర్శులు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు అందించే సేవల్లో అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఈవోఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు.

### యోగాలో కారంచేడు విద్యార్థి ప్రతిభ



వివేక్‌తేజ్‌తో పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యం, పీడీ మస్తానీ

**కారంచేడు:** యోగాలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మంచి ప్రతిభ కనబర్చి అధికారుల మన్ననలు పొంది స్టేట్ మీట్‌కు హాజరైన కారంచేడు యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి గర్నెపూడి వివేక్ తేజను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. సోమవారం మండల కేంద్రం కారంచేడు వైఎస్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థి చూపిన ప్రతిభను హెచ్‌ఎం సామ్రాజ్యంతో పాటు మాజీ కరస్పాండెంట్ యార్లగడ్డ రఘుబాబులు అభినందనలు తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల పీడీ షేక్ మస్తానీ శిక్షణలో వివేక్ తేజ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మూడో స్థానం సాధించాడన్నారు. దీంతో స్టేట్ మీట్ కోసం ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల (చిన్న తిరుపతి)లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ నెల 6,7 తేదీల్లో పాల్గొన్నాడన్నారు. తమ పాఠశాల పేరును రాష్ట్రస్థాయికి తీసుకెళ్లిన వివేక్ తేజ్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

### సెయింట్ ఆన్స్ కాలేజీకి ప్రత్యేక అవార్డు




అవార్డు అందుకున్న ప్రిన్సిపాల్ జగదీష్‌బాబు

**వేటపాలెం:** సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలకు జేఎన్‌టీయూ యూనివర్సిటీ ప్రత్యేక అవార్డు అందజేసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు సోమవారం తెలిపారు. కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ 18వ ఫార్మేషన్ డే సందర్భంగా ఇంజినీరింగ్ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో వంద శాతం ఎలిజిబుల్ బ్రాంచిల్లో ఎన్‌బీఏ గుర్తింపు పొందిన సందర్భంగా ప్రత్యేక అవార్డు బహూకరించినట్లు తెలిపారు. యూనివర్సిటీ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా మూడు కళాశాలలకు అవార్డులు బహుకరించగా అందులో సెయింట్ ఆన్స్ కాలేజీ అవార్డు అందుకుందని తెలిపారు. ఈ నెల 18వ తేదీన కాకినాడ యూనివర్సిటీలో ఫార్మేషన్ డే సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ సీఎస్ఆర్ కె.ప్రసాద్ ఈ అవార్డును ప్రదానం చేశారు. కళాశాల యాజమాన్యాన్ని ప్రిన్సిపాల్ జగదీష్‌బాబు, అక్రిడిటేషన్స్ డైరెక్టర్ సి.సుబ్బారావు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

### ప్రతిభను వెలికి తీసేందుకే పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

**వేటపాలెం:** విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకే ప్రతిభ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ సరోజిని పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలో ప్రతిభ పోటీలు సోమవారం నిర్వహించారు. 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో పి.మధుమిత, జి.సాయిశ్రీ, కె.గౌతమి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు వేణుగోపాలరావు, రాష్ట్ర జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు కుర్రా రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అన్నదాత పోరును విజయవంతం చేయాలి



అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరణం వెంకటేష్



బల్లికురవ: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

**చీరాల అర్బన్:** అన్నదాతలకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక రామకృష్ణాపురంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎరువుల బ్లాక్ మార్కెట్ అమ్మకాలపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతన్నకు అండగా అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారని, ఎరువుల కోసం గంటల కొద్దీ పడిగాపులు కాస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు అండగా వైఎస్సార్ సీపీ నిలుస్తోందన్నారు. మంగళవారం చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని స్థానిక ముక్కోణం పార్కు సెంటర్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం చీరాల ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీఓకు వినతిపత్రం అందించి ఎరువుల కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను తెలియజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి చీరాల నియోజకవర్గం పరిధిలోని వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, రైతు సోదరులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, చీరాల మండల పార్టీ అధ్యక్షుడు బక్కా అద్దంకిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, రైతు విభాగం అధ్యక్షుడు కావూరి రమణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గాదె మధుసూదన్‌రెడ్డి

**పర్చూరు (చినగంజాం):** వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు చీరాల ఆర్డీఓ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన దృష్ట్యా పర్చూరు నియోజకవర్గంలోని రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

**బల్లికురవ:** రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేనేని కృష్ణబాబు ధ్వజమెత్తారు. సోమవారం బల్లికురవలో అన్నదాత పోరు కరపత్రాలను ఆవిష్కరించారు. మంగళవారం ఉదయం చీరాల ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమానికి గ్రామాల వారీగా రైతులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు. రైతులు ఎరువుల కోసం క్యూలైన్‌లో నిలబడతుంటే ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, వ్యవసాయ పనుల సీజన్ ఆరంభమైనందున రైతలకు కావాల్సిన యూరియా, డీఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా అందించాలని కోరారు. ఈర్లగంగమ్మ సన్నిదానికి వెళ్లి కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాలని, రైతు కష్టాలు తీరాలని అమ్మవారిని ప్రార్థించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ రైతు విభాగం, యూత్, బీసీ సెల్, ఎస్సీ సెల్, దివ్యాంగుల చేనేత విభాగం అధ్యక్షుడు మేడకం శ్రీనివాసరెడ్డి, మక్కెన రవిబాబు, ఏ. సతీష్, పత్తిపాటి అంకయ్య, జొన్నలగడ్డ రమేష్, షేక్ ఖాదర్ బాషా, జి.వెంకటరామిరెడ్డి, శివారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్‌తో సమస్యల పరిష్కారం

- ఆర్డీవో చంద్రశేఖర నాయుడు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో

**చీరాల టౌన్:** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక చక్కటి అవకాశమయని చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖర నాయుడు అన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించారు. పలు శాఖల అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఆర్డీవోకు అందించారు. ఆర్డీవో మాట్లాడుతూ చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల ప్రజల రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల సమస్యలను అర్జీల ద్వారా అందిస్తే సత్వరమే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం అర్జీల స్వీకరణ ఉంటుందని చెప్పారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించగా ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. స్పందన కార్యక్రమంలో వివిధ రకాల రెవెన్యూ, భూ సమస్యలపై ప్రజలు 21 అర్జీలు అందించారు. డీఏవో జి.ముసలయ్య, పలు శాఖల అధికారులు, ఉద్యోగులు ఉన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఇంటి స్థలాలు, రేషన్ కార్డులు తదితర సమస్యలపై డీటీ సుశీలకు ప్రజలు అర్జీలు అందించారు.

# ఆర్టీసీ అద్దె బస్సుల్లో లవ్ సింబల్

- మహిళల అసహనం

**బల్లికురవ:** కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించింది. మహిళలు అధిక సంఖ్యలో బస్సులు ఎక్కడంతో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు స్టీరింగ్ ముందు పెద్ద లవ్ సింబల్ వేలాడదీయడంతో బస్సు ఎక్కాలంటేనే మహిళలు, ఉద్యోగినులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అద్దంకి డిపో నుంచి బల్లికురవ మండలం బల్లికురవ–సంతమాగులూరు మండలాల మీదుగా నరసరావుపేటకు వెళ్లి అక్కడి నుంచి నేరుగా ఒంగోలు వెళ్లే 1008 నంబర్ అద్దె బస్సులో 15 రోజుల నుంచి లవ్ సింబల్ కనిపిస్తోంది. సింబల్‌పై ప్రేమ నినాదం రాయించారు. దీనిపై మహిళల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.



అద్దంకి-నరసరావుపేట బస్సులో లవ్ సింబల్

# రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి



సమావేశానికి హాజరైన అధికారులు



అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

**కారంచేడు:** రైతులు వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని పర్చూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రవీణ అన్నారు. సోమవారం ఆమె మండల కేంద్రం కారంచేడులో రైతులు ఖరీఫ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా సాగుకు ముందు విత్తనశుద్ధితో ప్రారంభించి రసాయన ఎరువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. గ్రామంలో యూరియాను ఔట్‌రిచ్ ప్రోగ్రాం ద్వారా యూరియా వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వ్యవసాయ అధికారులు సిఫార్సు మేరకు మాత్రమే ఎరువులు వినియోగించాలన్నారు. ఎకరానికి కేవలం మూడు బస్తాల చొప్పున మాత్రమే వాడాలన్నారు. ఇవి పంటకు సమర్థంగా పనిచేయాలంటే జీవన ఎరువులు వాడుకోవాలన్నారు. దీంతో మంచి నాణ్యమైన పంటను, మంచి దిగుబడులు కూడా వచ్చే అవకాశాలున్నాయన్నారు. తహసీల్దార్ జి. నాగరాజు, ఏఓ ఎం.నాగరాజు పాల్గొన్నారు.

**ఎరువులు సకాలంలో అందేలా చూడాలి**

**యద్దనపూడి:** ఎరువులు సకాలంలో రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రవికుమార్ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీఓ జావేద్, వ్యవసాయాధికారి కుమారి, ఎస్సై రత్నకుమారి, రైతు సేవా కేంద్ర సిబ్బందితో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎరువుల నిల్వలు, విక్రయాలు, సాగు చేసిన పంటలు తదితర అంశాలపై చర్చించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ ప్రవీణ

**అవసరం మేరకు యూరియా తీసుకోవచ్చు**

**ఇంకొల్లు (చినగంజాం):** రైతులు తమ అవసరం మేరకు యూరియా తీసుకెళ్లవచ్చని తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఏఏలకు యూరియా పంపిణీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత లేదని, రైతులు తమ అవసరం మేరకు తీసుకోవచ్చనే విషయాన్ని వారికి అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయాధికారి మేరిమ్మ మాట్లాడుతూ యూరియా పంపిణీ సమయంలో రైతుల సౌకర్యం కోసం టెంటు, మంచినీటి వసతి కల్పించామని, రైతులకు టోకెన్లు ఇచ్చి స్లాట్‌లు కేటాయించి వారికి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని వీఏఏలకు సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ కిరణ్‌కుమార్, ఎస్ఐ జి.సురేష్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ యేషయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లీలావతి, వెలుగు ఏపీఎం అనూరాధ, ఏఈఓఆర్ కె. ఆనందరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి.జ్యోతి, హెచ్‌ఓ డి.రవిప్రకాష్ పాల్గొన్నారు. అదే విధంగా ఇంకొల్లు మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 2 అర్జీలు అందినట్లు తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్ తెలిపారు.

### విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న జీసీడీఓ చారులత

**కారంచేడు:** ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతి విద్యార్థికి అవసరమైన అన్ని రకాల మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కృషి చేస్తున్నామని బాపట్ల జిల్లా జీసీడీఓ (గర్ల్ చైల్డ్ డవలప్‌మెంట్ ఆఫీసర్) ఎం.చారులత అన్నారు. సోమవారం ఆమె మండల కేంద్రం కారంచేడు ఎన్‌టీఆర్ నగర్ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఎంత ఉంది, హాజరు శాతం, మధ్యాహ్న భోజన పథకం పనితీరు, ఎంత మంది విద్యార్థులు భోజనం చేశారు వంటి అనేక విషయాలపై ఆమె ఉపాధ్యాయులు, స్థానికులు, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత మనదేనన్నారు. ఎంఈఓ-2 వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం విజయచంద్ర పాల్గొన్నారు.

### రైతులతో ఆడుకుంటున్న ప్రభుత్వం



తహసీల్దార్‌కు వినతిప్రతం అందజేస్తున్న రైతులు, నాయకులు

**జె.పంగులూరు:** బర్లీ పొగాకు రైతులతో రాష్ట్ర ప్రభుత్వం ఆటలాడుకుంటోందని రైతు సంఘ సీనియర్ నాయకుడు నాగబోయిన రంగారావు విమర్శించారు. రైతులు కష్టపడి పండించిన బర్లీ పొగాకు కొనుగోలులో ప్రభుత్వం అనేక అవకతవకలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పంగులూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా చేశారు. రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో రైతుల వద్దకు జనవరిలో వచ్చిన పొగాకును ఇంత వరకు అమ్ముకోలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. వెంటనే ప్రభుత్వం రైతుల ఖాతాలో డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సింగారావుకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘ నాయకులు రాయిని వినోద్‌బాబు, నామపాలు ప్రభాకర్, సురేష్, సిద్ది రామయ్య పాల్గొన్నారు.

# నీటి పరీక్ష నమూనాలు సేకరించాలి



మాట్లాడుతున్న రత్నమోహన్




సిబ్బందితో మాట్లాడుతున్న రత్నమోహన్

**అద్దంకి:** జ్వర పీడితులున్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లోని నీటిని పరీక్షించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి రత్నమోహన్ అన్నారు. ఆయన సోమవారం పట్టణంలోని గాజులపాలెంలోని యూపీహెచ్‌సీని సందర్శించారు. అక్కడ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీలో జ్వరాల ప్రాంతాలకు రూట్‌మ్యాప్ తయారు చేసుకుని ఆయా ప్రాంతాల్లోని నీటిని సేకరించి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో యాంటీ లార్వా ఆపరేషన్స్ నిర్వహించి కీటక జనిత వ్యాధులను నిరోధించవచ్చని చెప్పారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు జ్వరాలను గుర్తించగానే నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యాధికారులు డాక్టర్ జయసింహ, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ అక్షిత, డాక్టర్ చిట్టిబాబు, సబ్ యూనిట్ అధికారి అర్జునరావు, ఎంపీహెచ్‌ఈవోలు, నాగేశ్వరరావు, జానీ బ్రహ్మానందం, సిబ్బంది పాల్గొన్నారు.

**జ్వర పీడితులకు సత్వర వైద్యం**

**అద్దంకి:** పట్టణంలోని యూపీహెచ్‌సీ పరిధిలో జ్వరాలతో వస్తున్న వారికి సత్వర వైద్యం అందిస్తున్నామని జిల్లా ఇమ్యూనిటీ అధికారి డాక్టర్ రత్న మోహన్ అన్నారు. ఆయన పట్టణంలోని కాకానిపాలెం యూపీహెచ్‌సీని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ జ్వరాలు వస్తున్నాయని, ప్రస్తుతం జ్వర బాధితుల సంఖ్య ఎక్కువగానే ఉందన్నారు. జలుబు, దగ్గు వంటి సూచనలు కనిపించగానే ప్రభుత్వ వైద్యశాలకు రావాలని సూచించారు. తర్వాత వైద్యశాల పరిసరాల పరిశుభ్రత, వైద్యశాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమ మోహన్, ఎస్‌కే ఎం.జానీ, ఎంపీహెచ్‌ఈవో హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ చేయూత అభినందనీయం

**బల్లికురవ:** పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ చేయూత ఇవ్వటం అభినందనయమని గుంటుపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఏడుకొండలు అన్నారు. సోమవారం పాఠశాలలోని 29 మంది విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు, స్పోకెన్ ఇంగ్లిష్ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో కర్క్ బాధ్యులు మాదాల సాంశివరావు, చల్లగండ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న రోటరీ క్లబ్

# ఏఎన్‌ఎంలకు ఇతర విధులు అప్పగించొద్దు

**వేటపాలెం:** వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను ఇతర డ్యూటీలకు వినియోగించవద్దని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి పసుమర్తి శ్రీనివాసరావు కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓను కలిసి ఎన్ఎన్‌ఎంలకు ఇతర డ్యూటీలు వేయవద్దని, ఆరోగ్యశాఖ పనులకే వినియోగించుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో డ్యూటీలు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలను ప్రతి నెలా ఒకటో తేదీన సామాజిక పెన్షన్లకు మాత్రమే వినియోగించుకొని మిగిలిన రోజుల్లో వైద్యశాలల్లో విధుల్లో ఉండేలా చూడాలని కోరారు. స్పందించిన ఎంపీడీఓ రాజేష్‌బాబు ఏఎన్‌ఎంలను ఇతర డ్యూటీలకు వినియోగించమని హామీ ఇచ్చారు. జిల్లా ఏపీజీఈఏ వైస్ ప్రెసిడెంట్ జె.సుధాకర్, ఏఎన్‌ఎంలు డి.సునీత, షేక్ కబీరా, బి.సుప్రజ, పి.అరుణ, ఎం.రాధ పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న ఏఎన్‌ఎంలు

# యూరియా సమస్యను పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

- సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం

**సంతమాగులూరు (అద్దంకి):** రాష్ట్రంలో యూరియా కొరత ఉందని, మండలంలోనూ ఉందని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ రైతు సంఘ నాయకుడు మాట్లాడుతూ రాష్ట్రర పార్టీ పిలుపుమేరకు అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లోని తహసీల్దార్‌లకు సోమవారం వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ప్రభుత్వం అధికారులతో ముందస్తు అంచనాలు వేయించక పోవడంతో నేడు యూరియా కొరత ఏర్పడిందన్నారు. ఖరీఫ్ నాలుగు నెలలు మించుతున్న తరుణంలో రైతులకు యూరియా సక్రమంగా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా మహిళా సంఘ నాయకురాలు ఎం.వెంకాయమ్మ, మండల కార్యదర్శి ఖాదర్ బాషా, సహాయ కార్యదర్శి రమణయ్య, ఎలమందయ్య, చీదర్ల కొండయ్య ఉన్నారు.

# అక్షరాస్యులుగా మార్చాలి

**ఇడుపులపాడు (చినగంజాం):** నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి అన్నారు. ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ కుటుంబంలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలన్నారు. 1965 నవంబర్ 17 సంవత్సరంలో యునెస్కో సర్వదేశాల విద్యాశాఖ మంత్రుల మహాసభ అనంతరం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రపంచంలో కొన్ని దేశాలు వెనుకబడి ఉండేందుకు కారణం నిరక్షరాస్యతన్నారు.




మాట్లాడుతున్న హెచ్‌ఎం పేరిరెడ్డి

### వ్యక్తి జీవితంలో వెలుగు నింపేది అక్షర జ్ఞానం



విద్యార్థులు తయారు చేసిన చిత్రం

**చినగంజాం:** వ్యక్తి జీవితంలో జ్ఞానాంధకారపు చీకట్లను తరిమి వెలుగును నింపేది అక్షర జ్ఞానమేనని మండలంలోని రామచంద్ర నగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం షేక్ నాయబ్ రసూల్ అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా పాఠశాలలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు పాఠశాలలోని ఉపాధ్యాయుడు ఎస్.నాగమల్లేశ్వరరావు సహకారంతో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ప్రతిబింబించేలా చక్కటి చిత్రాన్ని రూపొందించారు.